క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. కలెక్టరేట్లో భేటీ అయి మొక్కను అందజేశారు.

హోటల్లో ఎంహెచ్ఓ తనిఖీలు



నెల్లూరు(బారకాసు): ఆహార నాణ్యతపై ఆరోపణల నేపథ్యంలో నగరంలోని ఆచారివీధిలో గల రియాజ్ హోటల్‌ను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలను వంటశాల, స్టోర్‌రూమ్‌లో పాటించడంలేదనే అంశాన్ని గుర్తించారు. తదుపరి చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదును సవాల్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం నిర్వహించారు.

లాభాల బాటలో పేడూరు సొసైటీ



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా సహకార బ్యాంక్ అధికారి గుర్రప్ప

తోటపల్లిగూడూరు : మండలంలోని పేడూరు సహకార వ్యవసాయ పరపతి సంఘం లాభాల బాటలో పయనిస్తోందని జిల్లా సహకార బ్యాంక్ అధికారి గుర్రప్ప అన్నారు. ఈ మేరకు ఆయన పేడూరు సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేడూరు సొసైటీ లాభాల బాటలో నడుస్తూ కంప్యూటరైజేషన్ దిశగా కదులుతోందన్నారు. ఈ క్రమంలో సొసైటీకి అన్ని వసతులు సమకూరుతాయని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న సొసైటీకి అనుబంధంగా వ్యవసాయ గిడ్డంగిని స్థానిక రైతులు కోరారని, అనువైన స్థలం దొరికిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే జీవన ఎరువులు, నానో యూరియా వినియోగంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ మహాజన సభ సంఘ పర్సన్ ప్రకాష్, మండల ఏఓ శిరీషారాణి, సొసైటీ సీఈఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.1000 ఇస్తేనే ఉచిత ఇసుక

- మినగల్లులో టీడీపీ నేతల అక్రమ వసూళ్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. మండలంలోని మినగల్లు ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తోలుకుంటున్న వారి నుంచి స్థానిక టీడీపీ నాయకులు కోటంరెడ్డి సురేష్‌రెడ్డి, రాము రూ.1000 ఇవ్వాల్సిందేనని దౌర్జన్యానికి దిగుతున్నారు. 'మేము స్థానికులం, ప్రభుత్వం ఉచితంగా ఇసుక తోలుకోవచ్చని చెప్పినా మీరు అక్రమ వసూళ్లు చేస్తున్నారేంటి' అని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. మినగల్లు రీచ్ నుంచి ఇసుక ఎత్తుకుపోవాలంటే రూ.వెయ్యి ఇవ్వాల్సిందేనని, లేకపోతే అనుమతి ఇచ్చేది లేదని ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరిస్తున్నారు. చేసేది లేక వారు అడిగిన నగదు చెల్లించి కొందరు ఇసుక తీసుకెళ్తున్నారు. నగదు చెల్లించనివారు వెనుదిరుగుతున్నారు.

బాబోయ్.. దోమలు



నెక్లెస్ రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు



- అధ్వానంగా మారిన పారిశుధ్యం
- పేరుకుపోతున్న మురుగు
- తొలగించినా రోడ్డుపైనే వ్యర్థాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నెల్లూరు (పొగతోట): నగరంలో పారిశుధ్యం దయనీయంగా మారడంతో దోమల మోత ఎక్కువవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుండటంతో సమస్య తీవ్రమవుతోంది. ఫలితంగా నగరంలోని దాదాపు 8.5 లక్షల మంది నానా అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

బాలాజీనగర్, ఏసీనగర్, నెల్లూరు రూరల్ తదితర ప్రాంతాలు దోమలకు నిలయాలుగా మారాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటోంది. కొన్ని చోట్ల పూడిక తీసినా, వ్యర్థాలను రోజుల తరబడి రోడ్లపై ఉంచడంతో దోమల సమస్య మరింత ఎక్కువవుతోంది. ఈ పరిణామాలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

ఆస్పత్రులకు క్యూ..

దోమల కారణంగా మలేరియా, డెంగీ తదితర వ్యాధులతో ఆస్పత్రులకు ప్రజలు క్యూ కడుతున్నారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో అధిక ఫీజులు భరించలేక అప్పుల పాలవుతున్నారు. దోమల నివారణకు అధికార యంత్రాంగం పెద్దగా చర్యలు చేపట్టడంలేదు. ఫాగింగ్, కాలువల్లో ఆయిల్ బాల్స్‌ను వదలడాన్ని అధికారులు విస్మరించారు.

పేరుకుపోతున్న చెత్త

నగరంలో పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడం కూడా దోమల సమస్యకు ఓ కారణమవుతోంది. మాగుంట లేఅవుట్, చిల్డ్రన్స్ పార్కు తదితర ప్రాంతాల్లోనే చెత్తను నిత్యం తొలగిస్తున్నారు. పాఠశాలల చుట్టూ ఇదే సమస్య నెలకొనడంతో తమ పిల్లలెక్కడ జ్వరాల బారిన పడతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంప్యూటర్లు, కుట్టు మెషీన్ల వితరణ



నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో గల మానసిక దివ్యాంగుల కోసం కంప్యూటర్లు, కుట్టు మెషీన్లను దాతలు మంగళవారం అందజేశారు. రూ.1.7 లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లను రెడ్‌క్రాస్ సబ్ కమిటీ మెంబర్లు సోము భక్తవత్సలరెడ్డి, స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి ద్వారా రైస్‌మిల్లు యజమాని మునగా వెంకటేశ్వర్లు, సింహపురి పెయింట్స్ అధినేత సూర్యనారాయణ, పీఎన్నార్ సంస్థ నుంచి సీతారామారావు ఇచ్చారు. రెండు కుట్టు మెషీన్లను స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ సుబ్బారెడ్డికి జేవీఆర్ షాపింగ్ మాల్ అధినేత శ్రీనివాసులు అందజేశారు. రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ సురేష్‌కుమార్‌జైన్, కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, ప్రిన్సిపల్ గుర్నాథరావు, రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన



నెల్లూరు (టౌన్): మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లకు కొరత ఉందని, అర్హులకు పదోన్నతులను కల్పించి సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని డీఈఓ కార్యాలయ ఎదుట నిరసనను మంగళవారం చేపట్టారు. ఏడీకి వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడయ్యాయని, అయితే మున్సిపల్ పాఠశాలల్లో ఇది జరగలేదని పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, కార్యదర్శి చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు శీనయ్య, రియాజ్, భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస పెంపుతో రాణించొచ్చు



నెల్లూరు(అర్బన్): వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని శ్రీనివాస స్కూల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని పీహెచ్‌పీ అసోసియేషన్, జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సెట్నెల్ సీఈఓ శ్రీనివాసరావు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అష్ఫఖుల్లాఖాన్‌కు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫఖుల్లాఖాన్ జయంతిని ఆవాజ్ నేతల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బాలాజీనగర్‌లోని సంస్థ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు సుబ్రహ్మణ్యం, ఫయాజ్, రియాజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గోపురోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గోపురోత్సవాన్ని వేడుకగా మంగళవారం జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చి వేణుగోపాలుడ్ని దర్శించుకున్నారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సాధారణ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు సిటీ: సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

27న దివ్యనామ సంకీర్తన

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గణపతి సచ్చిదానంద స్వామి దివ్య నామ సంకీర్తన, వక్తృత్వ పోటీలను ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30కు నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94415 48655 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అవాస్తవాలను ప్రచారం చేయొద్దు



విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలను అరెస్ట్ చేశారంటూ అవాస్తవాలను వాట్సాప్ గ్రూపుల్లో కొందరు వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి వాటిని ప్రచారం చేసి జర్నలిజంపై ఉన్న విలువలను పోగొడుతున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ కేసులకు భయపడేవారెవరూ లేరని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంకా బలంగా జనంలోకి వెళ్తామని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నిరాశ్రయులకు అన్నదానం



నెల్లూరు సిటీ: నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో 200 మంది నిరాశ్రయులకు అన్నదానాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు రమేష్‌రాజు, ముని వెంకటసూర్య, వైస్ ప్రెసిడెంట్ కాళహస్తి సుధాకర్, సభ్యులు రమేష్, యశ్వంత్, ప్రేమ్‌సాయి, బాలాజీ, అనిల్, సాయితేజ, సతీష్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీవీనగర్‌లో ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బారకాసు): బీవీనగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం తొలగించారు. కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు నగరంలో ఆక్రమణలను త్వరలో తొలగించనున్నామని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు.

మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నూతన మద్యం పాలసీ ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, ప్రజలకు అవసరమైంది చౌక లిక్కర్ కాదని, చౌక విద్యుత్‌ను అందించాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. నగరంలో పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పెన్నా దిగువ, ఎగువ ప్రాంతాల్లో పొర్లుకట్టలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాలువకట్టపై పేదల నివాసాలను తొలగిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సరిపడా సిబ్బందిని నియమించి.. నాణ్యమైన వైద్యం, విద్యను అందించాలని పేర్కొన్నారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠపాలిత గురు దత్తాత్రేయ మఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివారదేవతల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలను బుధవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నామని పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మఠంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి హాజరుకానున్నారని వివరించారు. అయ్యప్ప దేవస్థానం నుంచి అమ్మవారి దేవస్థానం వరకు శోభాయాత్రను తొలి రోజు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే వారు 94405 88359, 94405 32936 నంబర్లను సంప్రదించాలని కోరారు. మహోత్సవ ఆహ్వాన కమిటీ సభ్యులు పత్రి గురురాజా, పాలడుగు సాయి, రాజా శ్రీనివాసరావు, శ్రీధర్, మధుసూదన్‌రావు, ఏడుకొండలు, దొంతంశెట్టి వినయ్, గ్రంథి లోకేషబాబు, చల్లగుండ్ల మోహన్‌రావు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈకి శుభాకాంక్షలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన దేశ్‌నాయక్‌కు పలువురు ఎన్జీఓ నేతలు శుభాకాంక్షలను తెలియజేశారు. రామలింగాపురంలోని సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇరిగేషన్ సర్కిల్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రామచంద్రయ్య, ఎస్పీ సర్కిల్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్జీఓఎస్ అసోసియేషన్ సెక్రటరీ మార్కండేయులు, జాయింట్ సెక్రటరీ సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలను తగ్గిస్తే ఆందోళనలు తప్పవు



మాట్లాడుతున్న అంకయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఇస్తున్న వేతనాలను తగ్గిస్తే ఆందోళనలు తప్పవని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్ పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మీటర్ రీడర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వీరు మాట్లాడారు. పీస్‌రేట్ మేరకు నగరంలో రూ.3.60, రూరల్‌లో రూ.3.73 ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఉన్నా, తక్కువ ఇస్తామని సంబంధిత కాంట్రాక్టర్లు చెప్పడం తగదన్నారు. సీఎండీ ఆదేశాలను అమలు చేయకపోతే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మీటర్ రీడర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్‌వలీ, కృష్ణ, సాల్మన్, బాలకృష్ణ, వెంకటసుబ్బయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): సమస్యను పరిష్కరించుకుందామని ఇంటికి పిలిచి యువకుడిపై దంపతులు కత్తితో దాడి చేసిన ఘటన శ్రామికనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు లోని న్యూ ఎస్బీఐ కాలనీలో నివాసం ఉంటున్న యాసిర్‌కు శ్రామికనగర్‌కు చెందిన బ్రహ్మనాయుడితో పాతకక్షలున్నాయి. ఈ క్రమంలో తన పుట్టిన రోజు సందర్భంగా శ్రామికనగర్‌లోని స్నేహితులను కలిసేందుకు యాసిర్ సోమవారం వెళ్లారు. ఈ తరుణంలో సమస్యను పరిష్కరించుకుందామంటూ ఆయన్ను ఇంటికి బ్రహ్మనాయుడు దంపతులు పిలిచారు. యాసిర్ రాగానే కత్తితో బ్రహ్మనాయుడు దాడి చేసి గాయపర్చారు. దీంతో బాధితుడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో స్నేహితులు చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురానికి చెందిన భాను విష్ణువర్ధన్, భాను సాయివర్ధన్, రెహ్మాన్, వేదాయపాళేనికి చెందిన తన్వీర్, నవాబుపేటకు చెందిన చారి రౌడీషీటర్లు. కొంతకాలంగా గంజాయి విక్రయాలకు వీరు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఎస్వీజీఎస్ కళాశాల వద్ద గంజాయిని నిందితులు విక్రయిస్తుండగా, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన భాను విష్ణువర్ధన్, తన్వీర్, చారి పరారయ్యారు. భానుసాయి వర్ధన్, రెహ్మాన్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి కిలో గంజాయి, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పాత వేదాయపాళెంలో ప్రసాద్ నివాసం ఉంటున్నారు. దుస్తులను ఇస్త్రీ చేయించుకొస్తానని చెప్పి, ఆయన కుమార్తె సోమవారం బయటకెళ్లారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగతనం కేసు ఛేదన

నెల్లూరు(క్రైమ్): దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ఇద్దరు జువెనైళ్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేట మార్కెట్ సెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ నూరి తన ఇంటికి తాళమేసి ఈ నెల 13న బయటకెళ్లారు. ఈ క్రమంలో తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి బీరువాలోని బంగారు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. అనంతరం ఇంటికొచ్చిన బాధితురాలు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్సై బాలకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా చోరీకి పాల్పడింది ఇరుగాళమ్మ గుడి, ఈద్గామిట్టకు చెందిన ఇద్దరు జువెనైళ్లుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 630 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జువెనైల్ జస్టిస్ బోర్డు ద్వారా వీరిని తిరుపతిలోని హోమ్‌కు తరలించారు.

యువతిని నమ్మించి.. ఆపై వంచించి

నెల్లూరు(క్రైమ్): యువతిని నమ్మించి మోసగించిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ యువతి ఎంబీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ప్రేమిస్తున్నానంటూ సమీప బంధువు చందు ఆమెను నమ్మించారు. కొంతకాలం సహజీవనం చేశారు. ఈ క్రమంలో గర్భం దాల్చిన ఆమె తనను పెళ్లి చేసుకోవాలని నిలదీశారు. దీంతో రహస్య వివాహం చేసుకున్నారు. అందరి సమక్షంలో వివాహం చేసుకుంటానని చెప్పి అబార్షన్ చేయించి ఆమెను పుట్టింటికి పంపారు. ఈ ఏడాది మేలో పెళ్లి విషయమై చందు కుటుంబసభ్యులతో యువతి కుటుంబసభ్యులు మాట్లాడారు. అప్పటి నుంచి ఆమెను దూరంగా పెడుతూ వచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఏడాది జూలైలో కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. నాన్‌బెయిలబుల్ కేసుగా ఇటీవల మార్చారు. దీంతో పరారీలో ఉన్న యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.